"గుర్తు లేదు." జవాబు చెప్పాడతను.

"కిందటి మంగళవారం ఈ టైంలో నువ్వేంచేస్తున్నావో చెప్పు."

అతను సమాధానం చెప్పలేక పోయాడు.

"పోనీ నిన్న ఉదయం అన్నంలో నువ్వు కలుపుకున్న రెండో ఐటం ఏమిటి?" మళ్ళీ ప్రశ్నించాడు గురువు.

అదీ అతనికి గుర్తులేదు.

"పునర్జన్మ ఎంత సహజమో మరుపు కూడా అంతే సహజం కాబట్టి నీకు నీ పునర్జన్మలేం గుర్తు లేవు." గురువు వివరించాడు.

## 66. ఆధారం-పరిణామం

శాస్త్రవేత్తలు సాధారణంగా నాస్తికులై ఉంటారు కదా. ఓ శాస్త్రవేత్తకి దేవుడంటే నమ్మకం లేదు. ఓ సారి అతను ఓ దైవభక్తుడి ఇంటికి వెళ్ళాడు. అతనింట్లో ప్లాస్టిక్‌తో చేసిన ఓ గ్లోబ్‌ని చూసి ఆసక్తిగా అడిగాడు శాస్త్రవేత్త.

"బావుంది. ఏ దేశంలో తయారైందిది? చైనాలోనా?"

"లేదు. దానంతట అదే తయారైందిది." జవాబు చెప్పాడా భక్తుడు.

"అదెలా సాధ్యం? ఏ వస్తువైనా ఎవరూ లేకుండా దానంతట అదే ఎలా తయారవుతుంది? ఆధారం లేకుండా పరిణామం అసాధ్యం అని భౌతిక శాస్త్ర సూత్రం." చెప్పాడా శాస్త్రవేత్త.

"సృష్టికర్త లేకుండా ఈ సృష్టి సాధ్యం అయిందని కదా మీ నాస్తికుల వాదన? అదే సూత్రంతో ఈ భూగోళం కూడా తయారైంది." నవ్వుతూ చెప్పాడా భక్తుడు.

## 67. ప్రపంచాన్ని బాగుచేయడం ఎలా?

శివాజీ సైన్యంలోని ఓ జనరల్ ఓసారి సమర్ధ రామదాసుకి నమస్కరించి వినయంగా అడిగాడు.

"స్వామీ! నాకు ఈ ప్రపంచం మొత్తం బాగుచెయ్యాలని వుంది. దానికి మంచి దారి ఏది?"

"అది చాలా తేలికయిన పని. ఈ ప్రపంచం మొత్తం బాగవాలి అంటే ముందుగా నీ దేశం మొత్తం బాగవ్వాలి. నీ దేశం మొత్తం బాగవ్వాలి అంటే ముందుగా నీ వూరు మొత్తం బాగవ్వాలి. నీ వూరు మొత్తం బాగవ్వాలి అంటే ముందుగా నీ కుటుంబం మొత్తం బాగవ్వాలి. నీ కుటుంబం మొత్తం బాగవ్వాలి అంటే ముందుగా నువ్వు మొత్తం బాగవ్వాలి." నవ్వుతూ జవాబు చెప్పాడు సమర్థ రామదాసు.

## 68. తత్త్వ బోధ

ఓ ఉత్తమ సన్యాసిని తనింటికి భిక్షకి పిలిచాడో గృహస్థు. ఆ రోజు టి.విలో ఇండియా-పాకిస్థాన్‌ల మధ్య జరిగే క్రికెట్ ఆటని ప్రసారం చేస్తున్నారు. ఇండియా ఆటగాళ్ళు బాగా ఆడినప్పుడు ఇంటిల్లి పాది ఆనందంగా చప్పట్లు కొడుతూ, పాకిస్థాన్ వాళ్ళు బాగా ఆడినప్పుడు నిస్పృహ చెందసాగారు. కాని ఆ సన్యాసి మాత్రం పాకిస్థాన్ వాళ్ళు బాగా ఆడినా కూడా ఆనందంగా చప్పట్లు కొట్టసాగాడు.

"ఇదేమిటి స్వామి? మీరు ఇండియన్, పైగా హిందువు అయివుండి కూడా, పరాయి మతస్థుల ఆటని మెచ్చుకుంటున్నారేమిటి?" గృహస్థు ఆశ్చర్యంగా అడిగాడు.

"నేను ఆటగాళ్ళల్లోని నైపుణ్యాన్ని మెచ్చుకుంటున్నాను తప్ప ఆటగాళ్ళని కాదు. అలాగే ప్రపంచంలోని మనుషుల చర్యలన్నిటినీ దైవలీలగా భావించి మెచ్చుకోవాలి తప్ప వాళ్ళ మీద రాగద్వేషాలని ఏర్పరుచుకోకూడదు. ఇందువల్ల కర్మబంధంలో చిక్కుకోం. మీ ఇంట్లో భిక్షచేసినందుకు గాను నేను బోధించే తత్త్వ బోధ ఇది." చెప్పాడా సన్యాసి.